క్లుప్తంగా

పైడిగాం ప్రాజెక్టు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

సోంపేట: మండలంలోని పైడిగాం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎమ్మెల్యే బి.అశోక్ గురువారం విడుదల చేశారు. శివారు గ్రామాలైన పలాసపురం, లక్ష్మవరం, జింకిభద్ర, బెంకిలి ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిత్రాడ శ్రీనివాసరావు, సూరాడ చంద్రమోహన్, మద్దిలి నాగేశ్వరరావు ఉన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పలాస: ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి కోరారు. ఈ మేరకు శాసనాం గ్రామంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు ఆశ కార్యకర్తలకు వర్తింప చేయాలని, ఆన్‌లైన్ వర్క్ చేయడానికి నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇవ్వాలని, ఉద్యోగ విరమణ సమయంలో గ్యాడ్యుటీ ఇవ్వాలని, పింఛను అమలు చేయాని కోరారు. యూనియన్ నాయకులు ఎం.లావణ్య, జి.కృష్ణవేణి, బి.లక్ష్మి, పి.మీనా, ఐ.యజ్ఞ, ఎస్.శ్రీలత, రమణమ్మ, ధనలక్ష్మి ఉన్నారు.

దర్గాని సందర్శించిన వక్ఫ్‌బోర్డు అధికారులు



దర్గాను పరిశీలిస్తున్న వక్ఫ్‌బోర్డు అధికారులు

ఇచ్ఛాపురం: పట్టణంలోని వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ఉన్న హజరత్ యూసఫ్ షా టకియా లాలాపేట దర్గా మేనేజింగ్ కమిటీ అధ్యక్షులుగా అబ్దుల్లానే కొనసాగిస్తున్నట్లు సంబంధిత అధికారులు అబ్దుల్‌సాదిక్, రియాజ్‌ఖాన్‌లు తెలిపారు. గురువారం పట్టణంలోని వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో గల దర్గాను వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, ఆడిటర్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దర్గా బాగోగులను ప్రస్తుత మేనేజింగ్ కమిటీ అధ్యక్షులుగా ఉన్న అబ్దుల్లానే చూసుకుంటారన్నారు.

మహిళల రక్షణకు కమిటీలు



మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు

పలాస: మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐసీసీ కమిటీలను ఏర్పాటు చేస్తోందని ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు, ఎంఈవో సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందికి పోస్ (ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్మెంట్) యాక్ట్‌పై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో లావణ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వారు మాట్లాడుతూ.. ఎక్కువగా మహిళలు లైంగిక వేధింపులకు, అత్యాచారాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను నివారించడానికి ఐసీసీ కమిటీలను ఏర్పా టు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పది మందికి మించి పనిచేస్తున్న మహిళలను ఈ కమిటీల్లో నియమిస్తున్నామన్నారు. ఏమైన ఘటనలు జరిగితే కమిటీలు ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.సరస్వతి, పైల అరుణ, దున్న సునీత, దానమ్మ పాల్గొన్నారు.

భయపెట్టిన ట్రాన్స్‌ఫార్మర్



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంట వచ్చిన దృశ్యం

టెక్కలి రూరల్: స్థానిక ఎన్‌టీఆర్ కాలనీ సమీపంలో ఉన్న గురువారం సాయంత్రం ఒక్కసారిగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు రావడంతో స్థానికులు భయాందోళన చెందారు. విద్యుత్‌శాఖాధికారులకు సమాచారం ఇవ్వడంతో వారువచ్చి సమస్యను పరిష్కరించారు.

ఉద్దానంలో మోస్తరు వర్షం

కవిటి: ఉద్దానం ప్రాంతంలోని పలు గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఈ ప్రాంతం చల్లబడింది. బల్లిపుట్టుగ, వరక, మాణిక్యపురం, కుసుంపురం ప్రాంతాల్లో కురిసిన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కల్లోల కడలి



కల్లోలంగా మారిన మంచినీళ్లపేట తీరం

- ఉవ్వెత్తున ఎగసి పడుతున్న అలలు
- ఉపరితల ఆవర్తనంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు
- మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని అధికారుల ఆదేశాలు

వజ్రపుకొత్తూరు:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పడనం, ఉపరితల ఆవర్తనంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కడలి కల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగసి పడి సముద్రం ముందుకు రావడంతో తీరం కోతకు గురవుతోంది. వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట, అక్కుపల్లి, కొత్తపేట, నువ్వలరేవు, దేవునల్తాడ గ్రామాల్లో తీరానికి బురద నీరు వచ్చి చేరుతోంది. వాతావరణం అనుకూలంగా లేనందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని వజ్రపుకొత్తూరు తహసీల్దార్ ఎం.సురేష్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం 2 సెం.మీ. వర్షపాతం నమోదైనందున మూడు రోజులు పాటు ఉరుములతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాల కురిసే అవకాశం ఉందన్నారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున రైతులు సైతం పొలాల్లో పనులు చేపట్టేందుకు వెళ్లరాదని గ్రామాల్లో దండోరా వేయించారు. వీఆర్‌ఓలను గ్రామాల్లోనే ఉంటూ ఎప్పటికప్పుడు వర్షాలకు సంబంధించిన వివరాలు అందించాలని ఆదేశించారు. పాడుబడిన, మట్టి ఇళ్లల్లో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు.

లంగరులోనే తెప్పలు, బోట్లు..

వేట కోసం తీరానికి తీసుకువచ్చిన తెప్పలు, బోట్‌లు లంగరులోనే ఉన్నాయి. ఈదురు గాలలకు కొట్టుకుపోకుండా తాళ్లతో కర్రలకు కట్టి ఉంచారు. వేట సాగకపోవడంతో వలలకు మరమ్మతులు చేసుకుంటున్నారు. మరోవైపు పూడిలంక ఉప్పుటేరులో లంగరు వేసినా వరద నీరు ఎక్కువైతే తెప్పలు కొట్టుకుపోయే అవకాశం ఉండటంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 50 వరకు తెప్పలు, పడవలు అక్కడ లంగరు వేసి ఉంచారు.



తీరంలోనే తెప్పకు లంగరు వేసిన మత్స్యకారులు



వేటలేక తీరంలోనే వదిలేసిన పడవలు



వరదల్లో కొట్టుకు పోయిన పూడిలంక వంతెన

పూడిలంకకు దారేదీ?

వర్షాకాలం వచ్చిందంటే చాలు పూడిలంక వాసుల్లో గుబులు మొదలవుతుంది. ఇప్పటికే లంక వారధి కొట్టుకుపోవడంతో వారికి బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఉప్పుటేరుపై రాకపోకలు సైతం నిలిచిపోయాయి. దాదాపు రూ.4.55 కోట్లతో అసంపూర్తిగా నిర్మించిన వంతెన వరదలకు కొట్టుకుపోవడంతో వారి కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. గతంలో జయశ్రీ సాల్ట్ అండ్ కెమికల్స్ యాజమాన్యం తాత్కాలిక గట్టు నిర్మించారు. అది కూడా ఈ ఏడాది లేకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంతబొమ్మాళి: బోరుభద్ర పరిసర గ్రామాలకు శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సర ఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ ఎం.శివకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పిన్నింటిపేట సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ వర్క్ చేపడుతున్నందున సరఫారాను నిలిపి వేస్తున్నామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కవిటి: రాజపురం విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలోని ఆర్.భైరిపురం ఫీడర్‌లో మెయింటెనెన్స్ పనుల పనుల కారణంగా ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్టు సంబంధికారులు తెలిపారు. ఆర్‌భైరిపురం, డిగొనపపుట్టుగ, నెలవంక, కపాసుకుద్ది గ్రామాలకు సరఫరా ఉండదు. ప్రధానంగా నెలవంక, కపాసుకుద్ది, పుటియాదళ రెవెన్యూ గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్‌కు ఆటంకం ఉంటుంది.

నందిగాం: నందిగాం సబ్ స్టేషన్‌లో 33/11కేవీ లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నారని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంరకరావు ఒక ప్రకటనలో తెలిపారు. నందిగాం, పెద్దతామరాపల్లి, హరిదాసుపురం, పెంటూరు, కణితూరు, గొల్లూరు, దిమిలాడ తదితర గ్రామాలకు సరఫరా ఉండదు.

ఇచ్ఛాపురం రూరల్: ధర్మపురం, లొద్దపుట్టి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ లైన్ మరమ్మతులు చేయనున్నారు. దీంతో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఈఈ జి.ప్రసాదరావు తెలిపారు. లొద్దపుట్టి, కొఠారీ, ధర్మపురం, ఇన్నేసుపేట గ్రామాలకు సరఫరా ఉండదని చెప్పారు.

సోంపేట: కొర్లాం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాదరావు తెలిపారు. కొర్లాం, బేసిరామచంద్రాపురం పంచాయతీల పరిధిలోని గ్రామాలకు కరెంటు ఉండదన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం

- డీఎల్‌పీవో ఐ.వి.రమణ

కంచిలి: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎల్‌పీవో ఐ.వి.రమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు ఇప్పటి వరకు ఎలా చేపట్టారనే దానిపై చర్చించారు. పంచాయతీ కార్యకలాపాలు, సచివాలయాల సేవలపై సమీక్షించారు. అనంతరం మఠం సరియాపల్లి సచివాలయాన్ని సందర్శించి పారిశుధ్యం పరిస్థితిపై ఆరా తీశారు. ఈవోపీఆర్డీ ఎన్ని రాంబాబు, స్థానిక సర్పంచ్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సోంపేట: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌పీవో రమణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. చెత్తతో సంపద తయారీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈవోపీఆర్డీ వేంకటేశ్వరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీవో రమణ

వీరులారా.. వందనాలు..!



పూండి వైఎస్సార్ కూడలి వద్ద శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



నందిగాం: వీరజవాన్ భార్య సమతతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

వజ్రపుకొత్తూరు: వీరులారా మీకు వేల వేల వందనాలు.. జై భారత్ మాతాకీ జై.. జగదీశ్వరరావు, రాజేష్ అమర్ రహే.. అంటూ వజ్రపుకొత్తూరు మండలం పూండిలోని సాయి వినీత్ విద్యా సంస్థలకు చెందిన 900 మంది విద్యార్థులు గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 16న జమ్మూ- కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల కాల్పుల్లో నందిగాం మండలం వల్లభరాయునిపాడుకు చెందిన సనపల జగదీశ్వరరావు, సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రకు చెందిన డి.రాజేష్ వీర మరణం పొందిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో విద్యార్థులంతా జాతీయ జెండాలు పట్టుకుని జై జవాన్ అంటూ పూండి బస్టాండ్ రోడ్డు, వైఎస్సార్ కూడలి ప్రాంతాల్లో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రిన్సిపాల్ అన్నెపు కైలాశరావు, వైస్ ప్రిన్సిపాల్ బత్తిని శ్రీనివాసరావు, అధ్యాపకులు బగాతి గణేష్, జి.సాయిప్రసాద్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వీరజవాన్ కుటుంబాన్ని ఆదుకుంటాం:మంత్రి

నందిగాం: ఇటీవల జమ్ములో జరిగిన కాల్పుల్లో మృతి చెందిన వల్లభరాయునిపాడుకు చెందిన సనపల జగదీశ్వరరావు కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి మృతుని కుటంబ సభ్యులను గురువారం పరామర్శించారు. జగదీశ్వరరావు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. వీరజవాన్ భార్య సమతకు ధైర్యం చెప్పారు. దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన జవాన్ కుటుంబానికి అండగా ఉండవలసిన బాధ్యత తమపై ఉందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, నాయకులు మళ్ల బాలకృష్ణ, కవిటి ధర్మారావు ఉన్నారు.

ఐటీఐ విద్యార్థికి ఆర్థికసాయం అందజేత

కవిటి: మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి (పాట్నా ఐటీఐ) గంటా కోదండరావు చదువు కోసం హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న చింతా మణిట్రస్టు వారు రూ.40 వేల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. ఈ మేరకు కవిటి చింతామణి అమ్మవారి ఆలయ ఆవరణలో ఆ మొత్తాన్ని కోదండరావుకు గురువారం అందజేశామని మండల కోఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్ తెలిపారు. సాక్షి పత్రికలో ''సాయం కోసం సరస్వతీపుత్రుడు ఎదురుచూపు''శీర్షికన 2023 జూన్ 23 తేదీన కథనాన్ని ప్రచురించగా.. చింతామణి ట్రస్టు స్పందించింది. అప్పటి నుంచి కోదండరావు చదువు కోసం తమవంతుగా సాయాన్ని అందజేస్తున్నారు. తాజాగా 3, 4 సెమిస్టర్ల ఫీజు నిమిత్తం ఈ మొత్తాన్ని అందించినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో చింతామణి ట్రస్టు, ఆలయ అభివృద్ధి కమిటీసభ్యులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బెందాళం రమేష్, మాజీ సర్పంచ్ బెందాళం వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఆరంగి మధు, పి.లక్ష్మణమూర్తి, బి కామరాజు, బి.సురేష్, బి.రవి, ఎం.శీతారాం, పాపయ్యరెడ్డి, జన్ని లోకనాథం, పొల్లాయి ఉమామహేశ్వరరావు, ఆరంగి రాజు, తెప్పల మోహన్‌రావు, కోళ్ల ముకుందరావు, సింహాచలం పాల్గొన్నారు.



కోదండరావుకు సాయాన్ని అందిస్తున్న ట్రస్టు సభ్యులు

పౌష్టికాహారం పంపిణీ

ఇచ్ఛాపురం రూరల్: పౌష్టికాహారంతోనే ఆరోగ్యమని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. టి.బరంపురం పంచాయతీలోని పి.శాసనాం అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని గురువారం పంపిణీ చేశారు. సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి ఉన్నారు.



పౌష్టికాహారం కిట్లు అందజేస్తున్న ఎంపీపీ బోర పుష్ప

హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణానికి హానికరం

టెక్కలి: హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణానికి హానికరమని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్ల అన్నారు. హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలో అధికారులతో ర్యాలీ నిర్వహించారు. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ఎంవీఐ డి.సంజీవరావు, ఎస్‌ఐ టి.వెంకటేశ్వరరావు, ఎక్సైజ్ ఎస్‌ఐ కె.ఎస్.గణేష్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చట్టరీత్యా నేరం

సోంపేట: ద్విచక్ర వాహనాన్ని హెల్మెట్ లేకుండా నడిపితే చట్టరీత్యానేరమని సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. సోంపేట బస్టాండు వద్ద హెల్మెట్ ప్రయోజనాలు తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. సోంపేట ఎస్‌ఐ బి.హైమావతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మడ్డు సర్వేశ్వరరావు, న్యాయవాదులు జోగారవు, విజయ్‌కుమార్, విద్యార్థులు ఉన్నారు.

ప్రాణాలకు రక్షణ

కోటబొమ్మాళి: హెల్మెట్ ప్రాణానికి రక్షణగా ఉంటుదని కోటబొమ్మాళి జూనియర్ సివిల్‌జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది, పోలీసులతో కొత్తపేట–కోటబొమ్మాళి మెయిన్ రోడ్డులో హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఏజీపీ ఎస్.తిరుపతి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాస్, న్యాయవాదులు పల్లి వాసుదేవరావు, వెలమల అప్పలనాయుడు, వాన నేతాజీరావు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

ఇచ్ఛాపురం: ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరని స్థానిక జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి పి.పరేష్‌కుమార్ అన్నారు. హెల్మెట్ వినియోగంపై పట్టణంలో వన్ కే వాక్ ర్యాలీని నిర్వహించారు. సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



టెక్కలి: అవగాహన ర్యాలీలో సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్ల తదితరులు



సోంపేట: హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పిస్తున్న జడ్జి శ్రీనివాసరావు



ఇచ్ఛాపురం: ర్యాలీలో జడ్జి పరేష్‌కుమార్



కాశీబుగ్గ: ర్యాలీలో జడ్జి మాధురి, న్యాయవాదులు



కోటబొమ్మాళి: ర్యాలీలో జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత తదితరులు

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని జడ్జి సూచించారు. న్యాయవాదులు నాగరాజుపాత్రో, లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ, జగ్గారావు, ప్రహ్లాదరెడ్డి, వేణు, రాంబాబు ఉన్నారు.

పలాసలో అవగాహన ర్యాలీ

కాశీబుగ్గ: పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సభ్యులు హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ వద్ద ప్రారంభమైన ర్యాలీ జీడీ పిక్క జంక్షన్ వరకు సాగింది. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.విశ్వేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ అనిల్ రాజ్, తాండ్ర మురళి, కోత రజనికుమార్, ప్రభాకర్, పట్నాయిక్, సీసీ నారాయణ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సత్ఫలితాలు



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా పెరటి తోటల్లో, పంట పొలాల్లో కాయగూరల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి బి.రేవతి అన్నారు. మండలంలోని పాయితారి, రత్తకన్న గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న కూరగాయల పెంపకాన్ని, నవ ధాన్యాలు ద్వారా పండించే పంటలను పరిశీలించారు. 'ఏటీఎం' మోడల్‌గా కూరగాయలు పెంపకంతో రైతులు తక్కువ దిగుబడి, అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. ప్రకృతి వ్యవసాయం హెచ్‌ఆర్ జె.శ్రీనివాస్, మెంటర్‌లు సూర్యనారాయణ, సత్యన్నారాయణ ఉన్నారు.

గ్రానైట్ పలకలు వితరణ



శ్రీధర్‌ను అభినందిస్తున్న గ్రామస్తులు

పలాస: మాకన్నపల్లిలో గ్రామస్తులు నూతనంగా నిర్మిస్తున్న శివాలయం ఫ్లోరింగ్ కోసం పలాస పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, శివాజీనగర్ షిర్డీ సాయి దేవాలయం ట్రస్టు చైర్మన్ దువ్వాడ శ్రీధర్ (బాబా) రూ.1.50 లక్షల విలువైన గ్రానైట్ పలకలను సమకూర్చారు. వీటిని గ్రామ పెద్దల సమక్షంలో కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శ్రీధర్‌ను అభినందించారు. గ్రామ సర్పంచ్ సైని దేశయ్య, కుత్తుం వినోద్, మాధవరావు ఉన్నారు.

కృష్ణమూర్తి మాస్టార్ సేవలు అజరామం

- సంతాప సభలో ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం రూరల్: ఉపాధ్యాయుడుగా, సమాజ సేవకుడిగా కృష్ణమూర్తి మాస్టార్ అందించిన సేవలు అజరామమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఎం.తోటూరు సత్యసాయి పాఠశాలలో గురువారం జరిగిన సాహుకారి కృష్ణమూర్తి మాస్టార్ సంతాప సభలో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంఘ నేతగా వారి సమస్యలపై పోరాటం చేశారని, ఎంతో మంది పేద పిల్లలను ఉచితంగా చదివించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దిన మాస్టార్ మన మధ్య భౌతికంగా లేకపోయినా ఆయన అందించిన సేవలు చిరస్మణీయంగా ఉంటాయని అన్నారు. ఎంపీపీ బోర పుష్ప, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, సర్పంచ్‌లు పిట్ట మామయ్యరెడ్డి, కారంగి త్రినాథ్‌రెడ్డి, నియోజకవర్గ ప్రైవేటు పాఠశాలల అధ్యక్షుడు చాట్ల తులసీదాసురెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బలివాడ ప్రకాశరావు పట్నాయక్, వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్, డాక్టర్ ఉలాల శేషుయాదవ్, డాక్టర్ నర్తు శేషగిరి ఉన్నారు.



కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

ప్రజాచైతన్య కళా సమితికి పురస్కారం

టెక్కలి: టెక్కలికి చెందిన ప్రజా చైతన్య కళా సమితికి రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో సేవా పురస్కారాలు అందజేశారు. జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా జేసీ ఎం.నవీన్‌కుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు చేతుల మీదుగా కళా సమితి సభ్యులు బమ్మిడి కృష్ణారావు, అనిశెట్టి చిట్టిన్న, మూల తాతయ్య, డి.ఎ.స్టాలిన్, డి.పూర్ణిత పురస్కారాలు అందుకున్నారు. 50 మందితో నేత్రదానాలు చేయించడం, 13 స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు చేయడంతో పురస్కారాలు వరించాయని సభ్యులు తెలిపారు. సమితి ప్రతినిధులు డాక్టర్ ఎస్.దిలీప్, ఆకుల ప్రకాశరావు, బి.అయ్యబాబు, డి.వీరాస్వామి హర్షం వ్యక్తం చేశారు.



పురస్కారాలు అందుకుంటున్న కళా సమితి సభ్యులు

మృతుల కుటుంబాలకు పరామర్శ

కంచిలి: మండలంలో వివిధ గ్రామాల్లో మృతి చెందిన పలువురు కుటుంబ సభ్యులను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి గురువారం పరామర్శించారు. నారాయణబట్టి గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ బుడ్డెపు ఆనంద్ తండ్రి భైరాగి, కొల్లూరు గ్రామానికి చెందిన జాజిమొగ్గల ధర్మారావు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.కొల్లూరుకి చెందిన బడ్డి కురమ్మ కాలుకు దెబ్బ తగలడంతో ఆమెను, కంచిలి పోలీస్ స్టేషన్ హోంగార్డు దేవరపద్ర హేమలత ఇటీవల గాయపడడంతో ఆమెను స్వగ్రామం రేఖాదేవిపురంలో పరామర్శించారు. మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, మఠం సరియాపల్లి ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం ఉన్నారు.